
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా
జిల్లా వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024





పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

జనసేనలోకి బుద్ధప్రసాద్

అవనిగడ్డ అభ్యర్థిగా ఖరారయ్యే అవకాశం

- గెలుపు గుర్రాల కోసం జనసేన అన్ని కోణాల్లో పరిశీలన
- బుద్ధప్రసాద్‌కు అనుకూలత
- అంతర్గత సర్వేలోనూ ఇదే స్పష్టం

అవనిగడ్డ, ఏప్రిల్ 1 : మాజీ ఉపసభాపతి, టీడీపీ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్ సోమవారం జనసేన పార్టీలో చేరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించగా, ఆ పార్టీ నుంచి వచ్చిన పిలుపు మేరకు బుద్ధప్రసాద్ సోమవారం పిఠాపురం వెళ్లి అక్కడ ప్రచారంలో ఉన్న పవన్ కల్యాణ్‌ను కలిసి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఆ పార్టీ తరఫున అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ప్రత్యామ్నాయంగా టీడీపీ నేత మండలి బుద్ధప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలుస్తోంది. సోమవారం కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్విన్ కుమార్, సోదరుడు మండలి ఉదయ్ భాస్కర్‌లతో కలిసి జనసేన పార్టీలో చేరగా, పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అన్నివైపుల నుంచీ పరిశీలించాకే...

జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో పోటీ చేస్తున్న ఏకైక స్థానమైన అవనిగడ్డ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ, ఉపసభాపతిగా పనిచేసిన అనుభవం ఉన్న బుద్ధప్రసాద్‌ను బరిలో నిలపాలని జనసేన భావిస్తున్నట్టు తెలుస్తోంది. జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్, బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణ పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. అందులో సానుకూలంగా ఫలితాలు రాలేదు. దీనికితోడు పార్టీ వారం రోజులుగా నిర్వహించిన అంతర్గత సర్వేలోనూ బుద్ధప్రసాద్ జనసేన అభ్యర్థి అయితే గెలుస్తారని నివేదికలు వచ్చాయి. దీంతో ఆయనకు సీటు ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్టు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీడీపీలో కూడా గడిచిన కొద్ది రోజులుగా జనసేన తరఫున మండలి బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండటం, జనసేనలోని కొందరు సీనియర్ నేతలు కూడా మండలి వెంట ఉండటంతో ఆయనకే టిక్కెట్ ఖరారయ్యే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-24 (మంగళ)
సహర్ (ఉదయం) : 4-41 (బుధ)

రాజీ డ్రామా రివర్స్..!

అనుకున్నదొకటి.. అయ్యిందొకటి.. అధికార పార్టీ వ్యూహం బెడిసికొట్టింది. ఎన్నికల వేళ తమ రాజకీయ ప్రయోజనార్థం వలంటీర్లను రాజీనామాలతో రెచ్చగొట్టాలన్న ప్రయత్నానికి ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ నాయకుల ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ జిల్లావ్యాప్తంగా రాజీ'డ్రామా'కు అనుకున్నంత స్పందన రాలేదు. రెండు జిల్లాల్లో కలిపి 20,008 మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా, కేవలం 880 మందే రాజీనామా చేయడం, మిగతా వారు అంతగా ఆసక్తి చూపక పోవడంతో వైసీపీ నాయకులకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది.



బందరు మునిసిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న వలంటీర్లు

రెండు జిల్లాల్లో వలంటీర్ల రాజీనామాలకు స్పందన నిల్

- ఉద్యోగం వదులుకునేది లేదని తేల్చిచెప్పిన వలంటీర్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 20వేల మంది వలంటీర్లు
- రాజీనామా చేసింది 880 మందే.. ఒక్క బందరులోనే 860 మంది
- అది కూడా ఎమ్మెల్యే పేర్ని నాని బలవంతం వల్లే..
- ఎన్టీఆర్ జిల్లా మొత్తం మీద ఆరుగురే రాజీనామా
- డబ్బు ఆఫర్ ఇచ్చినా పట్టించుకోని వలంటీర్లు

వైసీపీ నాయకులకు ఝలక్

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : రెండు జిల్లాల్లో 845 గ్రామ, 440 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 20,008 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరిలో ఆది, సోమవారాల్లో కేవలం 880 మంది వలంటీర్లు (కృష్ణాలో 874, ఎన్టీఆర్‌లో 6 మంది) మాత్రమే రాజీనామాలు చేశారు. ఈ లెక్కన చూస్తే కేవలం 4.39 శాతం మందే రాజీనామాలు చేశారని అర్థమవుతోంది. దీనివల్ల వేలాదిగా రాజీనామాలు చేయించాలని చూసిన అధికార వైసీపీ నేతలకు వలంటీర్ల నుంచే మద్దతు కరువైనట్టైంది.

రెండు జిల్లాల్లో ఇలా..

కృష్ణా జిల్లావ్యాప్తంగా మొత్తం 9,600 మంది వలంటీర్లు ఉన్నారు. వీరిలో 874 మంది రాజీనామాలు చేయటమంటే 9.1 శాతం మందే రాజీనామా చేసినట్టు. మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే పేర్ని నాని బెదిరింపులకు భయపడి 860 మంది రాజీనామాలు చేశారు. వీరిలో మచిలీపట్నం అర్బన్‌లో 578 మంది, మచిలీపట్నం మండల పరిధిలో 282 మంది ఉన్నారు. కృష్ణాజిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల నుంచి ఎలాంటి స్పందనా లేదు. కేవలం 14 మందే రాజీనామా చేశారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తంగా 10,418 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఆరుగురు రాజీనామా చేశారంటే మొత్తంగా 0.05 శాతమే.

అధికార పార్టీకి ఝలక్

వలంటీర్లంతా తమ చెప్పుచేతల్లో ఉన్నారని విర్రవీగిన అధికార పార్టీ నేతలకు ఇదో ఝలక్. బలవంతంగా రాజీనామాలు చేయించాలని చూసిన అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు చెంపపెట్టు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగించేస్తుందని, ఉద్యోగాలను కాపాడుకోవాలంటే వైసీపీ అధికారంలో ఉండాలని, దానికోసం మాతో కలిసి పనిచేయాలంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఒత్తిడి తెచ్చారు. బలవంతపు రాజీనామాలకు ఉసిగొల్పారు. రెండు నెలలు తమతో కలిసి పనిచేస్తే, మళ్లీ అధికారం రాగానే విధుల్లోకి తీసుకుంటామని, రాజీనామా చేసిన రెండు నెలలకు కూడా జీతాలు చెల్లిస్తామని మభ్యపెట్టినా వలంటీర్లు పెద్దగా పట్టించుకోలేదు.

అంతా రివర్స్

వలంటీర్లతో రాజీనామాలు చేయించటం వల్ల పథకాలకు సంబంధించి ఇంటింటికీ నేరుగా వెళ్లే అవకాశముండదు. విపక్షాలపై నెపం మోపి రాజకీయ ప్రయోజనాలను పొందాలన్నది వైసీపీ మొదటి ఎత్తుగడ. ఎన్నికల సందర్భంలో వలంటీర్లను పూర్తిగా తమ కోసం వాడుకోవాలన్న ఆలోచన రెండోది. వలంటీర్లతో ప్రచారం చేయించుకోవటంతో పాటు బహుమతులు, నగదు లావాదేవీలు వంటివి కూడా నిర్వహించుకోవచ్చన్నది వైసీపీ ప్లాన్. ఓటర్లకు నగదును పంపిణీ చేయించేందుకు వలంటీర్లనే ఉపయోగించాలని వైసీపీ నేతలు భావించారు. వలంటీర్లయితే తాము ఉద్యోగాలు కల్పించామని, నమ్మకంతో పనిచేస్తారని, అదే పార్టీ నాయకులైతే డబ్బును సక్రమంగా పంపిణీ చేయరన్న ఆలోచన ప్రభుత్వ పెద్దల్లో ఉంది. కానీ, అధికార పార్టీ ఒత్తిళ్లకు వలంటీర్లు లొంగలేదు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగించేస్తారన్న ప్రచారాన్ని కూడా విశ్వసించలేదు. వలంటీర్లను తొలగించబోమని చంద్రబాబు అనేక సభల్లో చెప్పారు. సచివాలయ వ్యవస్థను పటిష్టం చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వటంతో తమకు నష్టం లేదనే భావనలోనే వలంటీర్లు ఉన్నారు.

రాజీనామా చేయండి.. జీతాలిస్తాం..

మచిలీపట్నం నియోజకవర్గంలో పనిచేస్తున్న వలంటీర్లు రాజీనామా చేస్తే రెండు, మూడు నెలల పాటు పార్టీ తరఫున జీతాలు ఇస్తామని నగరంలోని కార్పొరేటర్లు, పంచాయతీల్లోని సర్పంచ్‌లు, వైసీపీ నాయకుల ద్వారా భరోసా కల్పించినట్లు విశ్వసనీయ సమాచారం. మళ్లీ ప్రభుత్వం వస్తే మిమ్మల్నే తిరిగి వలంటీర్లుగా నియమిస్తామని, ఈ 45 రోజుల పాటు వైసీపీ అభ్యర్థిని గెలిపించడానికి పనిచేయాలని ఒత్తిడి తెచ్చారు. అయితే, ఐదేళ్లుగా తమ సేవలను వినియోగించుకున్నారని, ఇప్పటికిప్పుడు తమతో రాజీనామా చేయిస్తున్నారని అధిక శాతం మంది వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజే మచిలీపట్నంలోని పలు సచివాలయాలకు వలంటీర్లను పిలిచి, పూలదండలు వేసి, మీ సేవలు మరువలేమని, వైసీపీకి అనుకూలంగా ఈ ఎన్నికల్లో పనిచేయాలని చెప్పి పంపారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే సేవలు వినియోగించుకుంటామని కూడా పేర్కొన్నారు. దీంతో అప్పట్లోనే వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తారనే ప్రచారం జరిగింది. కొన్ని ప్రాంతాల్లోని వలంటీర్లు వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీలో ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు.

మ్యుటేషన్ పేరుతో మింగేశారు!



పురపాలక సంఘ కార్యాలయం (ఫైల్)

అధికార పార్టీ నాయకుల అండదండలతో మున్సిపల్ ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారు. రూ.50 లక్షల మేర మున్సిపల్ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకున్నారు. ఇలా అధికారులు ఎవరికివారు అందిన కాడికి దోచుకుంటున్నారు. వైసీపీ ముఖ్య నాయకుడు వీరి వెనుక ఉండి నడిపిస్తున్నట్టు సమాచారం. ఈ తతంగంపై కార్యాలయంలో దుమారం రేగుతోంది.

మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి రూ.50 లక్షలు హాంఫట్

- ఎటువంటి రుసుమూ చెల్లించకుండానే మ్యూటేషన్
- కిందిస్థాయి నుంచి కమిషనర్ వరకూ పాత్రధారులే
- తెరవెనుక నుంచి అధికార పార్టీ నాయకుడి హస్తం

గుడివాడ : మున్సిపాలిటీ పరిధిలో మ్యుటేషన్ (ఆస్తి పేరు మార్పు) చేయాలంటే దరఖాస్తుదారుడు ప్రస్తుత ఆస్తి విలువలో ఒక శాతం మొత్తాన్ని కచ్చితంగా మున్సిపాలిటీకి చెల్లించాలి. దీన్ని వార్డు సచివాలయ అడ్మిన్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఆమోదించి మున్సిపల్ కమిషనర్‌కు పంపాలి. చివరగా మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా మ్యుటేషన్ జరుగుతుంది. ఇది సాధారణంగా జరిగేది. ఇటీవల కాలంలో భారీస్థాయిలో ఎటువంటి మ్యుటేషన్ ఫీజులను చెల్లించకుండా విచ్చలవిడిగా ఆస్తి పేర్లు మార్చారని వినికిడి.

రూ.50 లక్షలు పక్కదారి

మున్సిపాలిటీ పరిధిలో ఆస్తులు కొనుగోలు చేస్తే తప్పకుండా వారి పేర్లపై ఆస్తిపన్ను పేరును మార్చుకోవలసి ఉంది. దీని కోసం నిర్ణిష్ట రుసుం చెల్లించాలి. తొలుత వైసీపీ నాయకుడొకరు మున్సిపల్ అధికారుల సహకారంతో ఎటువంటి ఫీజు చెల్లించకుండా మ్యుటేషన్ చేయించుకున్నారు. ఆదాయం దండుకోవడానికి అధికారులకు ఈ పద్ధతి అక్షయపాత్రలా అనిపించింది. వైసీపీ ముఖ్య నాయకుడి అదృశ్యహస్తంతో కిందస్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు ఒక మాఫియాలా తయారై వసూళ్లకు తెర లేపారు. ఈ క్రమంలోనే దాదాపుగా 37 దరఖాస్తుల ద్వారా మున్సిపాలిటీకి మ్యుటేషన్ రూపంలో రూ.50 లక్షలు రావలసి ఉంది. దీనిని తమ జేబుల్లోకి మార్చి మ్యూటేషన్ చేశారు. అధికార పార్టీ చూపిన దారిలో పయనించి సదరు మొత్తాన్ని నొక్కేసి ఎవరిస్థాయికి తగ్గట్టు వారు వాటాలు పంచుకున్నారు. ఈ విషయం ఆనోటా ఈనోటా పడి బయటకు పొక్కింది. మార్చి 30వ తేదీ శనివారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సమావేశమై ఈ గండం నుంచి ఎలా బయటపడాలోనని తర్జనభర్జన పడుతున్నారు.

అసలు ఎవరి పాత్ర ఎంత?

రూ.50 లక్షల కుంభకోణంలో ఎవరి పాత్ర ఎంత అనేది తేలాల్సి ఉంది. సచివాలయ అడ్మిన్ మొదలు బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారి, మున్సిపల్ కమిషనర్, కంప్యూటర్ ఆపరేటర్లు వరకు అందరూ ఈ అక్రమంలో బాధ్యులే. మున్సిపల్ కమిషనర్‌కు తెలిసే ఈ స్థాయిలో కుంభకోణం జరిగిందని కార్యాలయ వర్గాల భోగట్టా. కమిషనర్ తన లాగిన్ ఐడీ, పాస్‌వర్డును ఒక రెవెన్యూ ఉద్యోగికి ఇవ్వడం, అధికార పార్టీ నాయకుల సహకారంతో మాఫియా గ్యాంగ్‌లా తయారై మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టడం చకచకా జరిగిపోతున్నాయని కార్యాలయమంతా కోడై కూస్తోంది.

డీఎంఏ చర్యలకు పాల్పడుతుందా?

కేవలం 3 నెలల్లోనే ఈ స్థాయిలో కుంభకోణం జరిగిందని కార్యాలయవర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. వైసీపీ ముఖ్య నాయకుడి అండదండలతో ఐదేళ్లలో ఏ స్థాయిలో మున్సిపల్ ఆదాయానికి గండికొట్టారో ఊహించడానికే భయానకంగా ఉంది. డిపార్టుమెంట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) చర్యలకు ఉపక్రమిస్తుందో లేదా ఎన్నికల వేళ మనకెందుకులే అని ఊరుకుంటుందో చూడాలి.

నేనొచ్చాక ఎటువంటి అక్రమాలూ జరగలేదు : కమిషనర్

2024, ఫిబ్రవరి 2వ తేదీన కమిషనర్‌గా తాను బాధ్యతలు స్వీకరించానని, ఆనాటి నుంచి నేటి వరకు మ్యుటేషన్ సొమ్ము గల్లంతు జరగలేదని, గతంలో జరిగి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధ్యులపై చర్యలు చేపడతానని మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

ఉద్యోగాల పేరిట మోసం

200 మంది వద్ద రూ.లక్ష చొప్పున వసూలు

- 125 మందికి మేధా టవర్స్‌లో ఉద్యోగం
- ఆరు నెలల తర్వాత బయటకు పంపేసిన వైనం
- డబ్బు తిరిగి ఇవ్వకపోగా నిర్లక్ష్యపు సమాధానం

హాలివుడ్ కంపెనీ ఎదుట ఉద్యోగుల ఆందోళన



గన్నవరం మేధా టవర్ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గన్నవరం, ఏప్రిల్ 1 : డబ్బు తీసుకుని ఉద్యోగం ఆశ కల్పించి, చివరికి రోడ్డున పడేశారని గన్నవరం మేధా టవర్స్‌లోని హాలివుడ్ కంపెనీ ఉద్యోగులు సోమవారం ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లోని రోబోమాక్ కంపెనీ వీఎఫ్ఎక్స్‌లో శిక్షణ, ఉద్యోగ కల్పన పేరుతో హాలివుడ్ కంపెనీ గత ఏడాది 200 మంది యువకుల వద్ద రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర చొప్పున తీసుకుంది. శిక్షణ పూర్తి చేసుకున్న యువకుల్లో 125 మందికి మేధా టవర్స్‌లోని తమ కంపెనీలో గత ఏడాది జనవరిలో ఉద్యోగాలు ఇచ్చారు. నెలకు రూ.10 వేలు చెల్లించారు. ఆగస్టు వరకూ ఉద్యోగం చేసిన తరువాత అందరినీ తొలగించారు. ఆదేమని ప్రశ్నిస్తే.. కంపెనీ నష్టాల్లో ఉందని, 2024 జనవరిలో మళ్లీ ఉద్యోగం చూపిస్తామని నమ్మబలికారు. అది నమ్మిన యువకులు గత జనవరి 20న కంపెనీ హెచ్‌వోడీని కలిశారు. సరైన సమాధానం రాలేదు. అయినా కంపెనీ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చివరకూ సోమవారం కంపెనీ వద్ద ఆందోళనకు దిగారు. మాట్లాడదాం.. కూర్చోమని నమ్మబలికిన హెచ్‌వోడీ అందరినీ ఒక గదిలో ఉంచి గన్నవరం పోలీసులను తీసుకొచ్చారు. సీఐ ప్రసాద్ ఉద్యోగులతో చర్చించారు. యాజమాన్యం చెప్పినట్టుగా వినాలని, ఏదైనా హడావిడి చేస్తే కేసులు పెడతామని, అన్యాయం ఏదైనా జరిగితే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో హెచ్‌వోడీ వ్యవహరించిన తీరుపై బాధితులు మండిపడ్డారు. మేధా టవర్స్ మెయిన్ గేటు వద్ద నిలబడి మళ్లీ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పవన్ అనే ఉద్యోగి మాట్లాడుతూ రోబో మాక్ హాలివుడ్ కంపెనీ యజమానులు ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారన్నారు. పేద కుటుంబాలకు చెందిన తాము ఉద్యోగాలు వస్తాయని ఆశతో వీఎఫ్ఎక్స్‌లో శిక్షణ తీసుకున్నామన్నారు. ఆరు నెలలు ఉద్యోగం చేశాక నష్టాల పేరుతో తమను ఇళ్లకు పంపించేశారని చెప్పారు. తాము కట్టిన డబ్బు జనవరిలో ఇస్తామని చెప్పారన్నారు. ఆ మాట ప్రకారం వస్తే కంపెనీ హెచ్‌వోడీ రమణారెడ్డి సమాధానం చెప్పకపోగా, డబ్బులు లేవు.. ఉద్యోగం లేదు.. వెళ్లిపోమంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని కన్నీటిపర్యంతమయ్యారు. న్యాయం చేయమంటే పోలీసులతో బెదిరించటం దుర్మార్గమన్నారు. సాయి వంశీ అనే ఉద్యోగి మాట్లాడుతూ రూ.లక్ష తీసుకుని పట్టుమని ఏడాది కూడా ఉద్యోగంలో లేకుండా చేశారన్నారు. హెచ్‌వోడీ, హెచ్ఆర్‌కు అప్పు చేసి డబ్బు కట్టామన్నారు. ఉద్యోగం లేకుంటే తమ డబ్బు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఎం.సాయి, కె.పవన్, సీహెచ్ రూబెన్, కె.అనిల్, ప్రకాష్ తదితరులు ఆందోళన చేయగా, వారికి మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, నాని మద్దతు తెలిపారు.

తొలి జాబితాలో దక్కని చోటు

ఎంపీల జాబితా విడుదల చేసిన కాంగ్రెస్

- విజయవాడ, మచిలీపట్నం స్థానాలు పెండింగ్

- 6లో..

పామర్రు పంచాయతీకి పవర్ కట్!

బకాయిలు చెల్లించలేదని విద్యుత్ శాఖ చర్యలు

- 6లో..

'పది' మూల్యాంకనం ప్రారంభం

జిల్లాలో రెండు కేంద్రాలు..

అధికారుల ఆదేశాలు బేఖాతరు

- మూసేసిన క్వారీ వద్ద నిత్యం లారీలు, ఎక్స్‌కవేటర్లు
- పగలంతా విశ్రాంతి, అర్ధరాత్రుళ్లు ఇసుక దందా

వాహనాలను తొలగించాలని తహసీల్దార్ అల్టిమేటం

తోట్లవల్లూరు : ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలు ఆగలేదు. దాదాపుగా 50 లారీలు, ఆరు ఎక్స్‌కవేటర్లను నిర్వాహకులు అక్కడే ఉంచి అక్రమార్కులు చీకటి దందాకు పాల్పడుతున్నారు. పగలంతా వాహనాలకు విశ్రాంతి ఇస్తు అర్ధరాత్రి సమయంలో మెరుపు వేగంతో ఇసుకను తోడేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సోమవారంలోపు లారీలను, ఎక్స్‌కవేటర్లను క్వారీ దగ్గర నుంచి తీసుకెళ్లాలని నిర్వాహకులను ఆదేశించారు. అయినా సాయంత్రం వరకు లారీలు క్వారీ వద్దే ఉన్నాయి. మూడు ఎక్స్‌కవేటర్లను మాత్రం దగ్గర్లోని పొలాల్లోకి తరలించారు. అంతకు మించి ఒక్క లారీని కూడా బయటకు తీయలేదు. ఇంకా మూడు ఎక్స్‌కవేటర్లు క్వారీ దగ్గరే ఉన్నాయి. ఆదేశాలను లెక్కచేయకుండా లారీలు, ఎక్స్‌కవేటర్లను క్వారీ దగ్గర ఉంచటం వెనుక వైసీపీ నేతల అండదండలున్నట్టు తెలుస్తోంది. క్వారీ నిర్వాహకులతో మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అనుచరులు కలవటంతో రాజకీయ అండ లభించిందని విమర్శలు వస్తున్నాయి. మంత్రి అనుచరులు ప్రత్యక్షంగా ఇసుక రవాణాలోకి దిగారని ఆరోపణలున్నాయి. ఎస్సీ సొసైటీ దగ్గర పట్టా భూముల్లో ఇసుక తీయటానికి అనుమతి లభించనప్పటికీ గ్రావెల్‌తో రహదారి నిర్మించి చాలా ఇసుకను దోచేశారు. మరో రహదారి వేసేందుకు గ్రావెల్ తోలి ఉంచారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా లారీలను తొలగించమని నిర్వాహకులకు స్వయంగా తెలియజేశామని, క్వారీ వద్ద అలాగే ఉంటే మంగళవారం వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.



రొయ్యూరు క్వారీ వద్ద లారీలు, ఎక్స్‌కవేటర్

క్వారీలో తాజాగా ఇసుక తీసిన ఆనవాళ్లు


స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో టీచర్లతో మాట్లాడుతున్న డీఈవో

పది మూల్యాంకనం ప్రారంభం

- కృష్ణా జిల్లాలో రెండు కేంద్రాలు..
- 611 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 101 మంది సీఈలు
- డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రెండు కేంద్రాల్లో పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. డీఈవో తాహెరా సుల్తానా క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరంలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, ఉర్దూ జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. మోమిన్, రాణిలు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు. నిర్మలా హైస్కూల్‌లో శిబిరంలో డైట్ లెక్చరర్ లలితామోహన్, సీఈ బోర్డు సెక్రటరీ జాన్ సాహెబ్ వ్యవహరిస్తున్నారు. ఈ శిబిరంలో గణితం, సైన్సు, సోషల్ జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు వ్యవహరిస్తున్నారు. డీఈవో తాహెరా సుల్తానా సోమవారం కేంద్రాలను పరిశీలించారు. అనారోగ్యం కారణంగా 81 మంది టీచర్ల కొరత ఏర్పడిందని, మంగళవారం ఈ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఖచ్చితంగా జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు.


ఎన్టీఆర్ జిల్లాలో మూల్యాంకన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషనర్

ఎన్టీఆర్ జిల్లాలో పకడ్బందీగా..

- కేంద్రాన్ని పరిశీలించిన విద్యాశాఖ కమిషనర్

విద్యాధరపురం : 2024 విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షల జావాబుపత్రాల మూల్యాంకన కార్యక్రమం సోమవారం ఎన్టీఆర్ జిల్లా కేంద్రాల్లో ప్రారంభమైంది. విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ డి.దేవానందరెడ్డి, పరిశీలకులు కె.వి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ ఏడాది టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని తెలిపారు. జావాబుపత్రాల మూల్యాంకన కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలోని రెండు బ్లాకుల్లో జరుగుతున్న మూల్యాంకన కార్యక్రమంలో 766 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనులు కాక నిరాశతో ప్రజలు, విద్యుత్ లేక అవస్థ పడుతున్న సిబ్బంది

పామర్రు పంచాయతీకి పవర్ కట్!

- బకాయిలు చెల్లించలేదని విద్యుత్ శాఖ చర్యలు

పామర్రు, ఏప్రిల్ 1 : నిధుల లేమి ఓ వైపు, ఖర్చుల భారం మరోవైపు అల్లాడుతున్న గ్రామ పంచాయతీలపై పెండింగ్ బకాయిల పేరుతో విద్యుత్‌శాఖ అధికారులు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగానే నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణ మేజర్ పంచాయతీ కార్యాలయంతోపాటు, గ్రామ సచివాలయాలకు అధికారులు విద్యుత్ సరఫరా నిలుదలచేశారు. ఈ నేపథ్యంలో వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. పామర్రు పంచాయతీ పరిధిలోని 49 విద్యుత్ సర్వీసులున్నాయి. గత కొన్నేళ్లుగా బకాయిలు రూ. 4కోట్ల 45లక్షల 82వేలకు చేరుకున్నాయి. ఇటీవల కేంద్రం విడుదల చేసిన 15 ఆర్థిక సంఘ నిధుల్లో నుంచి బకాయిలను రాబట్టుకునేందుకు విద్యుత్ అధికారులు పలుమార్లు గ్రామ పంచాయతీలకు నోటీసులు ఇచ్చినప్పటికి పాలకమండలిగాని, పంచాయతీ అధికారులుగానీ పట్టించుకోకపోవడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది పంచాయతీ కార్యాలయంతోపాటు ఒకటి, రెండు గ్రామ సచివాలయ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దీంతో కార్యాలయాల్లో పౌరసేవలు నిలిచిపోయాయి. ప్రజలతో పాటు గ్రామ సచివాలయాల సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నా ఉన్నాతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీమ్‌ను వివరణ కోరగా.. విద్యుత్ శాఖ సూచన మేరకు బకాయిల్లో 20శాతం రూ.10లక్షల 81వేల444 చెల్లింపు చేశామన్నారు. సరఫరా పునరుద్ధరణలో అధికారులు జాప్యం చేస్తున్నారని, ఈవిషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

వలంటీర్ల రాజీనామాలు
ఆమోదించకండి



- వలంటీర్లను అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రాజకీయాలు : రవీంద్ర ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని అధికారులు వాటిని ఆమోదించవద్దని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. మూకుమ్మడి రాజీనామాలకు వైసీపీ నాయకులు ఒక ఫార్మెట్ తయారు చేసి ఇచ్చారని, అదే ఫార్మెట్‌లో వలంటీర్లు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్నారన్నారు. వలంటీర్ల నిజస్వరూపం ప్రజలకు ఇప్పుడు అర్థమైందన్నారు. వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని చెబితే దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను వాడుకునేందుకు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనికి కారకులపై ఈసీ చట్ట రీత్యాచర్యలు తీసుకోవాలన్నారు. రాజీనామాలు సమర్పించిన వలంటీర్లు 'జై జగన్' అంటూ కార్యాలయాల నుంచి బయటకు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

ఎన్నికలైన 20 రోజులకే
వైసీపీ అడ్రస్ గల్లంతు!

- కేశినేని శివనాథ్ (చిన్ని)

మైలవరం, ఏప్రిల్ 1 : పక్క రాష్ట్రంలో ఓ పార్టీ 100రోజుల్లో ఎలా కొట్టుకుపోయిందో.. ఆంధ్రరాష్ట్రంలో ఎన్నికలైన ఇరవై రోజులకే వైసీపీ కొట్టుకుపోతుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. మైలవరంలో ఓ ప్రవేటు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు బూత్ కన్వీనర్లు, క్లష్టర్లు, శంఖారావం సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ డబ్బు సంచులతో గెలవొచ్చని మభ్యపడుతున్నా.. ప్రజల గుండెల్లో టీడీపీ బలంగా ఉందని, ఎప్పుడు గెలిపించుకుందామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు మా కుటుంబాన్ని నమ్మి రెండుసార్లు టికెట్టు ఇచ్చి గెలిపిస్తే పార్టీ మారిన నాని వంటి వ్యక్తులకు భవిష్యత్తు ఉండదని అన్నారు. నాకు పదవులు ఇచ్చినా.. ఇవ్వకపోయినా టీడీపీని వీడక నిత్యం పార్టీ కోసం శ్రమిస్తానన్నారు. జనసేన, బీజేపి, టీడీపీ కూటమి భారీ విజయానికి ప్రతిఒక్కరూ అహర్నిశలు శ్రమించి




బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన కోరారు.

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు, లోకేశ్‌లను తిట్టమంటే చేతకాదన్నందుకు నీకు ప్రాధాన్యత ఇవ్వలేక పోతున్నాను అనడం.. శాసన సభ్యుడిగా గెలిచిన నాటి నుంచి జగన్‌రెడ్డిని మైలవరం అభివృద్ధి గురించి కలిసే అవకాశం లేకపోవడంతో వైసీపీని వీడటం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు తిరుగుతుంటే మా పిల్లలు ఉన్నత చదువులు చదువుకున్నారు.. ఉద్యోగాలు లేవని, ఇళ్ల ముందు డ్రెయినేజీలు, రోడ్లు లేవని ప్రజలు అడుగుతుంటే సమాధానం చెప్పేపరిస్థితి లేకపోయిందన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం వలంటీర్లే అన్నట్లు, వార్డు మెంబర్లు దగ్గర నుంచి సర్పంచ్‌లు, శాసన సభ్యుల వరకు నిర్వీర్యం చేసి అభివృద్ధిని పక్కన పెట్టిన వైసీపీలో ఎలా కొనసాగాలని ప్రశ్నించారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, యువత భవిష్యత్తుకు గ్యారంటీ భరోసా ఉంటుందని టీడీపీలో చేరడం జరిగిందన్నారు. శంఖారావం కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బూత్ కన్వీనర్లకు, క్లష్టర్లను ఆయన కోరారు. అనంతరం బూత్ కన్వీనర్లకు కిట్టు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోమటి సుధాకర్, జనసేన నియోజకవర్గ నాయకులు అక్కల రామ్మోహనరావు (గాంధీ), జంపాల సీతారామయ్య, జువ్వా రాంబాబు, విజయబాబు, ఉయ్యూరు నర్సింహరావు, బుల్లిబాబు, లంక లితీష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, క్లష్టర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా టీడీపీ

- విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని

విద్యాధరపురం, ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచిందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. సోమవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం మహిళలు టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా ఆధ్వర్యంలో గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ముస్లిం మత సంప్రదాయం ప్రకారం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజాశ్రేయస్సు కోసం ఏ


ముస్లిం మహిళకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేశినేని చిన్ని

కూటమిలో చేరినా శాంతిభద్రతలు కాపాడి ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించే పార్టీ అని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ.15కోట్లతో షాదీఖానా, 92 సెంట్ల స్థలంలో ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అని తెలిపారు. పాతబస్తీని కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ముస్లిం ఐక్యవేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ నసీమా, జనరల్ సెక్రటరీ సయ్యద్ సత్తార్‌అహ్మద్, కేశినేని చిన్ని సమక్షంలో పార్టీకి మద్దతు తెలిపారు.

టీడీపీలో చేరిన హోప్ ఫర్ నీడి సంస్థ సభ్యులు

హోప్ ఫర్ నీడి సంస్థ సభ్యులు కేశినేని చిన్ని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివనాథ్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రాభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా శ్రమిస్తున్న చంద్రబాబునాయుడిని గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఎన్టీఆర్ భవన్‌లో తూర్పు కాపు ఆత్మీయ సమ్మేళన సమావేశపు కరపత్రాన్ని సోమవారం కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ జక్కంపూడి రోడ్డులోని వైఎస్ రెడ్డి కళ్యాణమండపంలో ఈ సమావేశం జరగనున్నది.

సిద్ధం సభలు పాలపొంగులే

- బందరు ఎంపీ బాలశౌరి


విలేకరుల సమావేశంలో నేతలు

పెనమలూరు, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలు పాలపొంగుల్లాంటివని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి వ్యాఖ్యానించారు. ఐదేళ్లుగా అభివృద్ధి జాడ లేకుండా.. ఉత్తుత్తి బటన్‌లు నొక్కుతూ ప్రజలను మభ్యపెట్టి, అదే ప్రజల వద్దకు వెళ్లి తనకు ఓట్లు వెయ్యమని అడగడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. సోమవారం పోరంకి వందడుగుల రోడ్డులో జనసేన కార్యాలయం ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. కంకిపాడు నుంచి గుడివాడకు కోట్ల రూపాయల కేంద్ర నిధులతో త్వరలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి నివేదించామన్నారు. బందరు పార్లమెంటులోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు. పెనమలూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బోడె ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో తనతోపాటు బందరు ఎంపీ సీటును కూడా గెలిపించుకునేందుకు కృషి చేస్తానన్నారు. గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సైకో జగన్‌ను ధృతరాష్ట్రుడితో పోల్చారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ, బాలశౌరిని మరింత మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా, జనసేన బాధ్యులు ముప్పారాజా, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, జనసేన, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కృత్తివెన్నులో బ్రహ్మరథం పట్టిన ప్రజలు


ప్రచార ర్యాలీలో బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను : రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమని బందరు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌లు అన్నారు. సోమవారం తొలిసారిగా బాలశౌరి పెడన నియోజకవర్గ పర్యటనలో మండలానికి విచ్చేయగా, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. గజమాలలతో ఘనంగా సత్కరించి అభిమానం చాటుకున్నారు. లక్ష్మీపురం నుంచి చినగొల్లపాలెం వరకు బైక్‌లు, కార్లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

మండలికి సీటిస్తే మూకుమ్మడి రాజీనామాలు

- తాము ఉండలేమని స్పష్టం చేసిన జనసేన ముఖ్యనేతలు


బుద్ధప్రసాద్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

అవనిగడ్డ, ఏప్రిల్ 1 : మండలి బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ ఇస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని జనసేన పార్టీ ముఖ్యనేతలు స్పష్టం చేశారు. సోమవారం అవనిగడ్డలో పార్టీ సీనియర్ నేత బచ్చు వెంకటనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనసేన క్రియాశీలక కార్యకర్తలు, ముఖ్య నేతలు మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో జనసేనకు వచ్చిన ఒక్క స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీనికితోడు కొద్దిరోజులుగా మండలి ఇంటి వద్ద టీడీపీ నేతలు వరుస సమావేశాలు నిర్వహించి, జనసేన పార్టీకి ప్రజల్లో ఆదరణ లేదని, జనసేన పోటీ చేస్తున్న 21 స్థానాల్లో మొదటిగా ఓడిపోయేది అవనిగడ్డ సీటేనని వ్యాఖ్యలు చేశారన్నారు. ఆ సమయంలో మండలి బుద్ధప్రసాద్, వెంకట్రామ్ అక్కడే ఉన్న విషయం గుర్తు చేశారు. మండలి బుద్ధప్రసాద్ ఇప్పుడు జనసేనలోకి వచ్చి ఎలా గెలుస్తారని, దీనికితోడు కండువాలు మార్చే వ్యక్తిని కాదని, డబ్బు రాజకీయాలకు తాను దూరమని చెప్పిన మండలి ఇప్పుడు డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి పోటీ చేస్తున్నారని పలువురు కార్యకర్తలు ప్రశ్నించారు. బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాలని జిల్లా పార్టీ ఎలా సూచిస్తుందని కొందరు తీవ్ర వ్యాఖ్యలు చేయటంతో నియోజకవర్గ నేతలకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అనుచరులకు మధ్య కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పార్టీలో ఎవరో ఒకరికి టిక్కెట్ ఇస్తే తామంతా ఒకే తాటిపైకి వచ్చి గెలిపించుకుంటామని, పక్క పార్టీ నుంచి తీసుకొచ్చి టిక్కెట్ ఇస్తే తాము ఉండబోమని, భావదేవరపల్లి, కోడూరు మండలాలకు చెందిన పలువురు నేతలు స్పష్టం చేశారు. పార్టీలో ముందు నుంచి పనిచేసిన నాయకులకే సీటు ఇవ్వాలని అధినేతపై ఒత్తిడి తెస్తామని, దీనికోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని బండ్రెడ్డి రామకృష్ణ కార్యకర్తలకు నచ్చచెప్పారు. కార్యక్రమంలో జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, చిలకలపూడి పాపారావు, బండ్రెడ్డి మల్లిఖార్జున, పూషడపు రత్నగోపాల్, కోన రాజశేఖర్, కొండవీటి సునీత, అరజా రాధిక, శ్రీలీల, పప్పుశెట్టి శ్రీను, ఎంపీటీసీలు కటికల వసంత్, బొప్పన భాను, ఆరు మండలాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

- పోలింగ్ సిబ్బందికి దశల వారీగా శిక్షణ
- కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి

కృష్ణలంక, ఏప్రిల్ 1 : జిల్లాలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాకు వివరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి జిల్లాస్థాయిలో సన్నద్ధత, ప్రక్రియ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించనున్న కార్యకలాపాలను వివరించారు. పీఓలు, ఏపీవోలు తదితరులతో పాటు ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు.


సమావేశంలోలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పాల్గొన్న ఇతర అధికారులు

ఏప్రిల్ 1 నాటికి జిల్లాలో రూ.1.87 కోట్ల నగదు, రూ.86.89 లక్షల మద్యం, రూ.5.58 లక్షల మత్తు పదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన లోహాలు మొత్తం రూ.5.27 కోట్ల విలువైన సీజర్లు జరిగినట్లు కలెక్టర్ వివరించారు.

జిల్లాలో కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

కృష్ణలంక : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఇప్పటి వరకు వివిధ మార్గాల ద్వారా 1235 ఫిర్యాదులు రాగా వాటిలో 1213 పరిష్కరించడం జరిగిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కోడ్ ఉల్లంఘనలతో పాటు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మీడియాలో 43 ప్రతికూల వార్తలకు సంబంధించి 31 వార్తలపై ఇప్పటికే తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అనుమతుల కోసం ఎన్‌కోర్ ద్వారా వచ్చిన 44 దరఖాస్తుల్లో 30 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఉపాధి హామీ లక్ష్యం.. 80 లక్షల పనిదినాలు

వన్‌టౌన్, ఏప్రిల్1 : ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామీ కింద 80 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఢిల్లీరావు, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వారానికి ఐదులక్షల పనిదినాలను కల్పించేందుకు ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. వేకువజామునే పనులు మొదలు పెట్టి ఉదయం 10 గంటలకల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి దృష్ట్యా కూలీలకు సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామని తాటి ఆకులు, ఈత ఆకులతో పందిళ్లు వేయడం, గ్రీన్ షెడ్స్ ఏర్పాటు చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టామన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్వామా పీడీ జె.సునీత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా పథకం ఎస్ఈ డి.వెంకటరమణ సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో 76 లక్షల 'ఉపాధి' పనిదినాలు
- కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం : జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా 2023-24సంవత్సరంలో 76లక్షల పనిదినాలను కల్పించినట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా గత ఏడాదిలో 73లక్షల పనిదానాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 76లక్షల పనిదినాలను కల్పించి రూ.191 కోట్లను కూలీలకు వేతనాలుగా చెల్లించామన్నారు. 22వేల కుటుంబాలకు వందరోజుల పాటు, మహిళలకు 41లక్షల పనిదినాలను, ఎస్సీ కుటుంబాలకు 29లక్షల పనిదినాలను కల్పించామని తెలిపారు. పింఛన్ల పంపిణీ అంశంపై మంగళవారం అధి



కారులతో సమావేశం నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, డీపీవో నాగేశ్వరనాయక్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు



తొలి జాబితాలో
దక్కని చోటు

- ఎంపీల జాబితా విడుదల చేసిన కాంగ్రెస్
- విజయవాడ, మచిలీపట్నం స్థానాలు పెండింగ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ స్థానాల అభ్యర్థులకు సంబంధించి విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు స్థానం దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో విజయవాడ, మచిలీపట్నం లోక్‌స్థానాలకు సంబంధించి ఏదోఒక స్థానానికి అభ్యర్థిని ఖరారు చేస్తారని ఆశావహులు భావించారు. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) రాష్ట్రంలో కడప, కాకినాడ, రాజమండ్రి, విశాఖ, బాపట్లతో పాటు పలు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. ఇందులో జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. త్వరలో విడుదల చేయబోయే రెండో జాబితాలో ఈ రెండు స్థానాల అభ్యర్థుల పేర్లు ఉండొచ్చని భావిస్తున్నారు. విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి నలుగైదుగురు పోటీపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బుర్రా కిరణ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వారితోపాటు వల్లూరి అశోక్ ఉంది. ఇప్పటికే టీడీపీ, వైసీపీలు కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలను అభ్యర్థులుగా ప్రకటించాయి. అదే కోవలో వెళ్లానుకుంటే కాంగ్రెస్ పార్టీ నుంచి బుర్రా కిరణ్, సుంకర పద్మశ్రీ, వల్లూరి అశోక్‌లకు అవకాశాలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది కాకుండా కాపు సామాజికవర్గం నుంచి అభ్యర్థి ఎంపిక చేయాలనుకుంటే నరహరశెట్టి నరసింహారావుకు అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నరసింహారావు 2019 ఎన్నికల్లో విజయవాడ ఎంపీగా పోటీ చేశారు. మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ గొల్లు కృష్ణ, చలమలశెట్టి ఆదికిరణ్ ఆశిస్తున్నారు. వారితోపాటు కోకా పణిభూషణ్ ఎంపీగా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ముగ్గురిలో పణిభూషణ్, కృష్ణ బీసీ సామాజికవర్గానికి చెందిన వారు. ఆదికిరణ్ ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పేర్లను ప్రకటించాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి ఇక్కడ బీసీ అస్త్రాన్ని ప్రయోగించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో గొల్లు కృష్ణకు గానీ, పణిభూషణ్‌కు గానీ లైన్ క్లియర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆశావహులు నీరసించారు. త్వరలో విడుదల కాబోయే జాబితాలో తమ పేర్లు ఉంటాయా అన్న సందిగ్ధంలో ఉన్నారు. జాబితాలో వారి పేర్లను ఉండేలా చేసుకోవడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో సీనియర్లు కచ్చితంగా పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. దీనికి తగినట్టుగానే మొదటి జాబితాలో సీనియర్ నేతల పేర్లను ప్రకటించారు.


గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రాకు బొకేతో స్వాగతం పలుకుతున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఎన్నికల పరిశీలకునికి స్వాగతం

గన్నవరం, ఏప్రిల్ 1 : రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఏఎస్ రామ్మోహన్ మిశ్రాకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో సోమవారం రాత్రి ఆయన ఇక్కడికి విచ్చేశారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, అదనపు సీఈవో ఎంఎన్ హరెందిర ప్రసాద్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తదితరులు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళ్లారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి
యువకుడు దుర్మరణం



జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 1 : బతుకు దెరువు కోసం రాష్ట్రానికి వచ్చి కన్నతండ్రి, సొంత బాబాయి కళ్లెదుటే యువకుడు మృతి చెందిన విషాద ఘటన సోమవారం చిల్లకల్లులో జరిగింది. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వల్లెగూడెంకు చెందిన రావూరి కిరణ్ (30) తండ్రి కృష్ణ, బాబాయితో కలిసి కేబుల్ వైర్లు రిపేరు చేస్తుంటారు. దీనిలో భాగంగా చిల్లకల్లులోని ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్ వైర్లు సరిచేసేందుకు వచ్చి విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన తీగలను సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలిందా.. లేక అదుపు తప్పి కింద పడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ..
అమెరికాలో గీతాంజలి మృతి

- కొణకంచిలో విషాదఛాయలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 1 : అమెరికాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలో కొణకంచి గ్రామానికి చెందిన కమతం గీతాంజలి (30) సోమవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. గీతాంజలి పుట్టినరోజు సందర్భంగా అమెరికాలో ఆలయానికి వెళ్లి వస్తుండగా ఆదివారం ప్రమాదంలో గీతాంజలి కుమార్తె హానిక (6) అక్కడికక్కడే మృతి చెందగా, గీతాంజలి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీంతో కొణకంచిలో విషాద వాతావరణం నెలకొంది. గీతాంజలి భర్త నరేష్, కుమారుడు సురక్షితంగా ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి

కంకిపాడు, ఏప్రిల్ 1 : ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మంతెన ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనుతో పాటు పలువురు యువకులు సోమవారం ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, రానున్నది కూటమి ప్రభుత్వమని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదన్నారు. కార్యకర్తలు కూడా సైనికుల్లా ఈ 40 రోజులు పనిచేయాలని సూచించారు.



బాలశౌరితో మంతెన యువకులు

వలంటీర్ డిస్మిస్

ఉయ్యూరు, ఏప్రిల్ 1 : సోషల్ మీడియాలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓ పార్టీకి సపోర్టు చేస్తూ పోస్టులు పెట్టిన వలంటీరును సోమవారం విధులనుంచి తొలగించారు. ఉయ్యూరు నగరపంచాయతీ 12వ వార్డు 6వ సచివాలయంలో వలంటీరుగా పనిచేస్తున్న వడ్డిపల్లి బేబి (పిన్నింటి బేబి) ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి రుజువు కావడంతో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఆమెను విధులనుంచి తొలగించినట్టు నగరపంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

జ్యోతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో
కంప్యూటర్ శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

ఉయ్యూరు, ఏప్రిల్ 1 : ఆధునికయుగంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో ప్రపంచమే కుగ్రామంగా తయారైన పరిస్థితుల్లో యువకులు కంప్యూటర్ శిక్షణ పొందడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచుకోవచ్చని రిటైర్డు ప్రొఫెసర్ శివప్రసాద్ అన్నారు. నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకిరా మయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణా తరగతులను సోమవారం శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి కె స్వరూపరాణి, ట్రెజరర్ నీరజ, నూకల సాంబశివరావు, పరుచూరి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె శివనాగేంద్రం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

కంకిపాడు, ఏప్రిల్ 1 : వివాహిత అనుమానాస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెన్నేరు సీఎస్ఐ చర్చి దగ్గరలో నివాసముంటున్న డోకిపర్తి సుమలతకు కొడుకు, కూతురు. కూతురు ప్రసన్నకుమారిని కలవపాములకు చెందిన రాకేష్‌కు ఇచ్చి వివాహం జరిపారు. వారికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా కూతురు అల్లుడు కంకిపాడు విజయలక్ష్మి థియేటర్ ఎదురుగా చెప్పుల షాపు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారికి వ్యాపారంలో నష్టం రావటం వల్ల చుట్టు ప్రక్కల వారి దగ్గర అప్పులు చేశారు. ఇదే విషయాన్ని ప్రసన్న కుమారి తల్లికి చెబుతూ బాధపడుతూ ఉండేది. అప్పుల బాధతో మనస్తాపం చెంది సోమవారం కలవపాములలోని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాడు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు కాంట్రాక్టర్‌పై
విద్యుత్ శాఖ డీఈఈ ఫిర్యాదు

పెనమలూరు, ఏప్రిల్ 1 : కానూరు విద్యుత్ కార్యాలయంలోని ఆపరేషన్స్ సబ్ డివిజన్ విభాగంలో డీఈఈగా సేవలందిస్తున్న ఎం పూర్ణచంద్రరావు తన కదలికలపై అనధికారికంగా కార్ల సరఫరా కాంట్రాక్టర్ కన్నేసి ఇతరులకు తన రోజువారీ కార్యక్రమాలు, ప్రయాణాలకు సంబంధించిన వ్యవహారాలపై సమాచారం అందిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కానూరు విద్యుత్ ఆపరేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న మాదాల పూర్ణచంద్రరావు తన రోజువారీ కార్యకలాపాలపై తనకు విద్యుత్‌శాఖ నుంచి కార్లను కాంట్రాక్టుకు పెట్టిన పటమటకు చెందిన అచ్యుత్ కిరణ్ అనే వ్యక్తి ఇతరులతో కుమ్మక్కై కారులో స్టీరింగ్ కింది భాగంలో మ్యాప్ మై ఇండియా కంపెనీకి చెందిన జీపీఎస్ ట్రాకర్‌ను అక్రమంగా ఏర్పాటు చేసి తన రోజువారీ కదలికలను ఇతర వ్యక్తులకు చేరవేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. విద్యుత్ అక్రమ వినియోగదారులకు కూడా సమాచారం అతడు పంపిస్తుండడంతో అక్రమ వినియోగదారులు అప్రమత్తమై తమ దాడుల్లో పట్టుపడకుండా తప్పించుకోడం వల్ల విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం కలుగుతోందని, కాంట్రాక్టరు నిర్వాకం వల్ల తనకు వ్యక్తిగత భద్రత పట్ల అనుమానాలు కలుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డుపై రద్దుగుట్టలు
తొలిగించేది లేదంటున్న కౌన్సిలర్

ఉయ్యూరు, ఏప్రిల్ 1 : ఉయ్యూరు నగరపంచాయతీ 8వ వార్డులో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ రోడ్డుపై అడ్డంగ రద్దుగుట్టలు పోసి రోజుల తరబడి తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రోడ్డుపై వెళ్లేవారికి అసౌకర్యం కలుగుతుంది. ఇరుకుగా ఉండే రోడ్డుపై కౌన్సిలర్ తన ఇంటిముందు రాళ్లముక్కలు, రద్దు గుట్ట పోయడంతో ఆప్రాంత ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా తప్పుకునే వీలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగు తున్నాయని, గుట్టలు తొలగించాలని అడిగితే ఖాళీ ఉన్నప్పుడు తొలగిస్తానని బెదిరిస్తున్నాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి గుట్టలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉయ్యూరు 8వ వార్డులో రోడ్డుపై ఇబ్బంది కరంగా ఉన్న రద్దు గుట్టలు

సూపర్‌సిక్స్ పథకాలు ఇంటింటికీ వివరించాలి
టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 1 : టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ వివరించడంతో పాటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ప్రతి బీఎల్‌ఏ తనకు కేటాయించిన బూత్ పరిధిలో చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలించాలని బూత్ లెవెల్ ఏజంట్లకు టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు దిశానిర్దేశం చేశారు. హనుమాన్‌ జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన బాపులపాడు మండల బీఎల్‌ఏల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లోని బూత్‌ల వారీగా పోలింగ్ శాతం గతంతో పోల్చిచూస్తూ తక్కువగా ఓట్లు పోలయిన బూత్ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల జాబితాలో పేర్లను సరిచూసు కోవాలని, ఓట్లు లేనివారిని గుర్తించి తక్షణం చేర్పించాలని సూచించారు. టీడీపీ కూటమి విడుదల చేసిన సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరిస్తూ గ్రామాల్లో శంఖారావం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. టీడీపీ అనుబంధ కమిటీలతో పాటు జనసేన, బీజేపీ నాయకులను కలుపుకుని సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, రైతు నాయకుడు వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ విభాగాల నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.



బీఎల్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు, దయాల రాజేశ్వరరావు

టీడీపీతోనే మైనారిటీలకు రక్షణ

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే విందు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేలేరు, మల్లవల్లి గ్రామాల్లో రంజాన్ సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. వేలేరులో ఇమామ్ అహమ్మద్‌రజా ఆధ్వర్యంలో సామూహిక నమాజ్ అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంఘ అధ్యక్షుడు మహ్మద్ సలాంబాషా, మత పెద్దలు సయ్యద్ ముజీర్, షేక్‌బాజీ, షేక్‌గౌస్, అబ్దుల్ రసూల్, షేక్ జబీర్, తదితరులతో పాటు వేములపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

●మల్లవల్లి టీడీపీ నాయకుడు జాన్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇమామ్ షేక్ రిజ్వాన్ ఆధ్వర్యంలో మౌజాన్ కాలే మస్తాన్ పర్యవేక్షణలో మతపెద్దలు షేక్ మీర్జావలి, షేక్ బాజీ (పెద్దబుడే), షేక్ కాలీషా, తదితరులతో కలసి ప్రత్యేక ప్రార్థన అనంతరం ఉపవాసదీక్ష విడిపించారు. ముస్లిం చిన్నారులతో కలిసి ఆయన ఉల్లాసంగా పాల్గొన్నారు. యనమదల వెంకయ్యారావు, అక్కినేని ధర్మరాజు, కృష్ణాజీ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు, హోమాలు

ఉయ్యూరు, ఏప్రిల్ 1 : ఉయ్యూరు వేణుగోపాలస్వామి, పంచపట్టాభిరామస్వామి నూతన ఆలయంలో స్వామి వార్ల విగ్రహ పునః ప్రతిష్ఠ పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి సర్వశుభాలు కలిగే విధంగా సోమవారం వేద స్వస్తి, గోపూజ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, అగ్నిప్రతిష్ఠ, కుంభ పూజ, నవగ్రహ పూజ, నవగ్రహ హోమాలను వేదపండితులు నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ చింతయ్య, డైరెక్టర్లు, కార్యనిర్వహణాధికారి గుర్రాల శ్రీనివాస రావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వైసీపీ విధ్వంసకర పాలనకు ముగింపు పలకాలి
టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకర పాలన, సహజ వనరుల దోపిడీని అడ్డుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శంఖారావం కార్యక్రమం నిర్వహిం చారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళా స్వావలంబనతో పాటు విద్యకు తోడ్పాటు, రైతులకు పెట్టుబడి సాయం, యువతకు ఉపాధి అవకాశాలు, కల్పించే దిశగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసే బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటుం దన్నారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంచుతూ నేరుగా లబ్దిదారులకు ఇంటివద్దే అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆళ్ల తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ద్వారా ప్రతి కుటుంబానికి అందే లబ్ధిని ప్రజలకు మరింత చేరువచేయాలని ఎన్ని కలు అయ్యేంత వరకూ ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేసి బందరు పార్లమెంట్ జనసేన కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి, గన్నవరం టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు అత్యధిక మెజారిటీ తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. గ్రామంలోని సమస్యలను గాలికొదిలేసి మట్టి దోపిడీ చేస్తూ టీడీపీ శ్రేణులపై కేసులు పెట్టడంతోనే వైసీపీ పాలన గడచి పోయిందని సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, తెలుగు మహిళ అధ్యక్షురాలు దోనవల్లి నాగశిరోమణి ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడంతోనే ప్రధాన సమస్యలైన వీరవల్లి ఆర్వోబీ, వట్టిగుడిపాడు లింకు రహదారి అభివృద్ధి, పోలవరం కాలువ ద్వారా గ్రామానికి సాగునీరం దించే విధంగా కృషి చేస్తామని ప్రజాప్రతినిధులతో పాటు టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, కార్యదర్శి కసుకుర్తి వేణుబాబు, బీజేపీ నాయకుడు కసుకుర్తి వెంకటశాస్త్రులు, మైనేని శ్రీనివాసరావు, కనకవల్లి యాకోబు, మాజీ సర్పంచ్ ఆళ్ల మణికృష్ణ, అర్జునరావు, మందపాటి రాంబాబు, ఇలపర్తి సంసోను, యువత నాయకులు సుధాకర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో జరిగిన శంఖారావంలో టీడీపీ నేతలు

టీడీపీతోనే అన్ని వర్గాలకు మేలు..

కంకిపాడు : టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. కంకిపాడు మండలం వణుకూరులో సోమవారం ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడు తూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందన్నారు. ఎలాంటి దుర్మార్గపు పాల నను ప్రజలు ఎన్నడు చూడలేదన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా చేసింది ఏదీ లేదన్నారు. పెనమలూరులో బోడె ప్రసాద్ ఎమ్మెల్యేగా, చంద్రబాబు నాయుడు సీఎంగా గెలవాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. తెలుగు యువత నాయకుడు బోడే మనోజ్, కొమ్మినేని శ్రీనివాసరావు, పిడికిటి శ్రీనివాసరావు, సుంకర రమేష్, అప్పయ్య, బడుగు సాంబశివరావు, పులి విజయ్, ఎస్‌కె మాబు తదితరులు పాల్గొన్నారు.



వణుకూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బోడె వెంకట్రామ్

చర్చి ప్రారంభోత్సవంపై ఇరువర్గాల ఘర్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 1 : బాపులపాడు గ్రామంలో నూత నంగా నిర్మించిన సీఎస్ఐ దేవాలయం ప్రారంభోత్సవం పలు వివాదాలకు కేంద్రంగా మారి రెండు వర్గాల మధ్య ఘర్షణకు కేంద్రబిందువైంది. మొదటి నుంచి ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన వ్యక్తి నిధుల దుర్వినియోగం చేశాడనే అభియోగంపై కమిటీలోని సభ్యులు అతనిని బాధ్యతలనుంచి తొలగించారు. అనంతరం నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కమిటీలోని వ్యక్తితో నిధుల లెక్కల విషయంలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ బేదాభిప్రాయాలు చర్చి ప్రారంభోత్సవ సందర్భంగా సోమవారం ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. గతంలో నిర్మాణ పనులు పర్యవేక్షించిన వర్గం తరఫున జయప్రకాష్ అనే వ్యక్తి ఆలయం ప్రారంభోత్సవం చేయరాదని కోర్టును ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న సీఎస్ఐ యాజమాన్యం 3వ తేదీన ప్రారంభించాల్సిన దేవాలయాన్ని సోమవారం మధ్యాహ్నమే ప్రారంభించి ప్రార్థనలు నిర్వహించారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

200 మంది టీడీపీలో చేరిక

పెనమలూరు, ఏప్రిల్ 1: యనమలకుదురుకు చెందిన 200 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ వెలగపూడి బాబూరావు వర్గం చేరిక యనమలకుదురులో పార్టీని బలోపేతం చేస్తుందన్నారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముప్పవరపు నారాయణ, రత్నారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో బోడె ప్రసాద్

పాడిరైతు సంక్షేమమే ధ్యేయం
చైర్మన్ చలసాని ఆంజనేయులు



పాడిరైతును సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 1 : పాలసేకరణలో అత్యధిక ధర చెల్లిస్తూ, ప్రతిఏటా మూడుసార్లు ముందుగానే బోనస్ చెల్లిస్తూ పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధితో పాటు సంక్షేమమే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని అంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని కృష్ణవరం, పి.సురవరం పాలసొసైటీలను పాడిరైతు సంక్షేమం మన మతం- అలు పెరుగని సేవ మన అభి మతం కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఉదయం తనిఖీలు చేశారు. పాలసేకరణ విధానం, ఫ్యాట్ కొలత తదితర విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాడిరైతులో ముఖాముఖి నిర్వహించిన పాలసేకరణ పెంచేందుకు అవసరమైన సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిలారు కిరణ్‌కుమార్, పాలసొసైటీ అధ్యక్షులు, పాలక వర్గ సభ్యులు, పాడిరైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

దివిసీమలో సాయుధ దళాల కవాతు



నాగాయలంక, ఏప్రిల్ 1 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించాయి. భావదేవరపల్లి, చోడవరం, బ్రిల్లీగ్రాహం నగర్, పెదపాలెం, నాగాయలంక, అంబేడ్కర్ నగర్‌లో కవాతును నిర్వహించారు. ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డీఎస్పీ పి.మురళీధర్ పిలుపునిచ్చారు. గ్రామ కూడలిలో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అవనిగడ్డ సీఐ త్రినాథ్, నాగాయలంక ఎస్సైఎం.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

జనసేన నేత మండలికి ఘన స్వాగతం

అవనిగడ్డ, ఏప్రిల్ 1 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆహ్వానం మేరకు టీడీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరి అవనిగడ్డ విచ్చేసిన బుద్ధప్రసాద్‌కు ఆయన అభిమానులు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు, మండలి అభిమానులు ఆయనకు ఎదురేగి స్వాగతం పలికి అభయాంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు మహిళా నేతలు తలశిల స్వర్ణలత, పైడిపాముల కృష్ణకుమారి, బండే నాగ వెంకట కనకదుర్గ తదితరులు బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా మరోమారు విజయం సాధించాలని ఆకాంక్షించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే రాఘవ, మోర్ల శివ, మెడబలిమి మల్లిఖార్జునరావు, లంకమ్మ ప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, తలశిల నాని, మత్తి శ్రీనివాసరావు, జనసేన నేత విజయ్ తదితరులు స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.భవాని

ఫార్మశీ రంగానికి ఎంతో ప్రాధాన్యం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 1 : విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఫార్మశీ ప్రముఖ పాత్రవహిస్తోందని జేఎన్‌టీయూ కాకినాడ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ బి.భవాని అన్నారు. వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల 14 వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత జ్యోతి వెలిగించి వేడుకను ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి ఎస్. సాయినాథ్ జ్ఞాపకార్థం తల్లి తండ్రులు బి.ఫార్మశీ టాపర్‌కు ప్రకటించిన రూ.10వేల బహుమతిని పి.భార్గవికి ముఖ్యఅతిథి భవాని చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఎకడమిక్స్ టాపర్స్, స్పోర్ట్స్, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులసాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కళాశాల సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సొసైటీ సభ్యులు ఈడే వెంకట రామారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్, పి.రవీంద్ర బాబు, ఎన్.ఎస్.ఎస్.వి రామాంజనేయులు, జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్, పి.కోదండ రామారావు, ఎంఆర్‌సిహెచ్ శాస్త్రి, ఎం.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీలో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం జరిగింది. జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్యను స్మరిస్తూ కవాతు నిర్వహించారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి జ్ఞానమణి, రిజిస్ట్రార్ శోభన్‌బాబు, ప్రిన్సిపాల్ ఆర్ విజయకుమారి, ట్రస్టు చైర్మన్ కె జగదాంబ తదితరులు పాల్గొన్నారు.



పెడనలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్



గ్యాస్‌బండతో రవీంద్ర ప్రచారం



కళింగ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆముదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్

జగన్ అరాచక పాలనకు చరమగీతం

● ప్రజలకు ఎంపీ బాలశౌరి, కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణప్రసాద్ పిలుపు

పెడన రూరల్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి పిలుపునిచ్చారు. పెడన నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో బాలశౌరి పాల్గొన్నారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఆయనను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో బాలశౌరి మాట్లాడుతూ పెడన నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బందరు పోర్టు నిర్మాణానికి తన వంతు కృషిని వివరించారు. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ దోపిడీకి అడ్డుకట్ట పడాలన్నారు. బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ బాలశౌరి, కృష్ణప్రసాద్ కాంబినేషన్‌తో నియోజకవర్గం అభివృద్ధి సాధిస్తుందన్నారు. పెడనకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన పార్టీలో చేరగా సాదరంగా ఆహ్వానించారు. పెడన నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్, అర్జా నగేష్, అబ్దుల్ ఖయ్యుం (హన్ను), యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, హమీదుల్లా, మట్టా శివపావని, కూనపరెడ్డి రంగయ్యనాయుడు, వరుదు రాము, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆత్మవిమర్శ చేసుకోవాలి

అవనిగడ్డ : దివిసీమ రైతాంగానికి ఎంతో మేలు చేసిన ఎంపీ బాలశౌరిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి అభ్యర్థి బాలశౌరిపై ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, షాడో ఎమ్మెల్యే కడవకొల్లు నరసింహారావు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బాలశౌరి ఎంపీగా నియోజకవర్గ పరిధిలో బాలశౌరి చేసిన అభివృద్ధి పనులే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు మానుకుని నియోజకవర్గానికి తాను ఏమీ చేశాడో రమేష్ బాబు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. రావి రత్నగిరి, కొమ్ము పవన్ కుమార్, మండలి రామమోహనరావు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, యలవర్తి చిన్నా, యలవర్తి ఆది, మెగావత్తు గోపి, కొట్టి విజయ్ కుమార్, పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుయుక్తులను తిప్పికొట్టండి

పామర్రు : పామర్రు నియోజకవర్గంలో టీడీపీ లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని టీడీపీ అభ్యర్థి వర్లకుమార్ రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ కుయుక్తులను తిప్పికొట్టాలని, ప్రజలు సక్రమంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో అన్ని అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, గొట్టిపాటి లక్ష్మీదాసు, జక్కా శ్రీనివాసరావు, వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా టీడీపీ



మచిలీపట్నం టౌన్ : ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద మహిళలను ఆదుకుంటామని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం శారదానగర్, శివగంగ ప్రాంతాలలో మచిలీపట్నం అసెంబ్లీ యోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర పర్యటించారు. గ్యాస్ బండ భుజాన పెట్టుకుని రవీంద్ర ప్రచారం చేశారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామని, బస్‌లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, సనకా నాగులు తదితరులు పాల్గొన్నారు. కాగా, 27వ డివిజన్‌లో కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము ఆధ్వర్యంలో రంజాన్ నెల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కొల్లురవీంద్రతో పాటు అమీన్, గడ్డం శివ, మాగంటి శిరీష్, హస్మాన్, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

కళింగులు వెనిగండ్లకు మద్దతుగా నిలవాలి : కూన రవికుమార్

నందివాడ (లక్ష్మీనరసింహాపురం), ఏప్రిల్ 1 : కళింగులు ఐక్యంగా ఉండి గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆముదాలవలస టీడీపీ అభ్యర్థి, కళింగ నేత కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీనరసింహాపురంలో కళింగ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కూన రవికుమార్ పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో కళింగులంతా టీడీపీకి మద్దతు ఇచ్చి కళింగుల సౌకర్యాలను సాధించుకోవాలన్నారు. గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్లకు మద్దతుగా నిలిచి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన గ్రామస్థులకు సూచించారు. గుడివాడ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ) పాల్గొన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి గుడివాడ నియోజకవర్గానికి ఏ ఒక్క పని చేయని వ్యక్తికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అఖండ విజయంతో గెలిపిస్తే గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సువారి వెంకట రంగారావు, బాబురావు, ప్రభాకర్, లక్ష్మీప్రసాద్, మద్దాడ నాగరాజు, మాధవ, సూవారి తారక, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను ఇంటింటికీ వివరించాలి

గుడ్లవల్లేరు : బీసీ డిక్లరేషన్‌లోని ప్రతి అంశాన్ని ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత పార్టీ బీసీ నాయకులు తీసుకోవాలని టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి కోరారు.

సోమవారం రాత్రి గుడ్లవల్లేరు మండల టీడీపీ కార్యాలయం అయిన కొసరాజు వెంకట రామకృష్ణా రైస్‌మిల్ ఆవరణలో నిర్వహించిన బీసీ కార్యకర్తల సమాశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4000 పింఛన్, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ వంటి పథకాలను వివరించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు జంగం మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎ.రామ్మోహనరావు, కొడాలి రామరాజు, బత్తిన దాసు, బెల్లంకొండ ఏడుకొండలు, పామర్తి కన్నె భాస్కరరావు, ధనకోటేశ్వరరావు, లక్ష్మీ నరసింహరాజు, పళ్లెం నరసింహారావు, పామర్తి సత్తిబాబు, ఈడే మోహన్, సాయి, కాగిత నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

కోడూరు : మండలంలో బుధవారం నుంచి పెన్షన్ పంపిణీ చేయటం జరుగుతుందని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. కావున పెన్షనర్లు గ్రామపంచాయతీ, సచివాలయ కార్యాలయం వద్దకు వెళ్లి ఆధార్ కార్డు ప్రూఫ్‌ని చూపించి పెన్షన్ తీసుకోవాల్సిందిగా కోరారు.



వేళ్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కోడూరు : లింగారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయం నందు వేళ్లమ్మ తల్లి, గణపతి, పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావుని ఆలయ అర్చకులు సత్కరించారు. కడవకొల్లు నాంచారయ్య, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, కడవకొల్లు శ్రీనివాసరావు, జరుగు రవీంద్ర పాల్గొన్నారు.

సప్తగిరి బ్యాంక్ సేవలపై ప్రచారం

చల్లపల్లి : చల్లపల్లిలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు డిజిటల్ మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని మేనేజర్ పి.రమేష్ తెలిపారు. చల్లపల్లి ప్రధాన కూడలిలో మైకు ప్రచారం నిర్వహించి వ్యాపారస్థులను కలసి బ్యాంక్ సేవలను వివరించారు. ఖాతాదారుల సౌలభ్యం నిమిత్తం అన్ని రంగాల్లో వారికి అనువైన రుణాలను సరళమైన వడ్డీ రేట్లకు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లు అత్యధిక వడ్డీ రేట్లను అందిస్తున్నామని, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీతో ఖాతాదారులకు సేవలు అందిస్తామని తెలిపారు. క్యాషియర్ వి.తేజేంద్ర, గోల్డ్ అప్రైజర్ నాగబాబు, బ్యాంక్ సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

శివనామ ఏకాహం

కపిళేశ్వరపురం(పమిడిముక్కల) : కపిళేశ్వరపురంలో లయన్స్‌క్లబ్ సభ్యుడు తాతినేని రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం శివనామ ఏకాహం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వంద మంది మహిళలు శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

పామర్రు : పసుమర్రు గ్రామంలో కోడిపందేలు వేస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.1820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు.

హజరత్ ఇమామ్ అలీకి ముస్లింల రక్తతర్పణం

అలీనఖీపాలెం(పమిడిముక్కల), ఏప్రిల్ 1 : పవిత్ర రంజాన్ మాసం 21వ రోజు హజరత్ ఇమామ్ అలీ వర్ధంతిని పురస్కరించుకుని అలీనఖీపాలెంలో హజరత్ ఇమామ్ హుస్సేని కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు చెస్ట్ బీటింగ్ నిర్వహించి రక్తతర్పణం గావించారు. గ్రామంలో జరీని ఊరేగించిన అనంతరం రక్త తర్పణం చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంజుమనే హుస్సేన్, ఖదీర్ సొసైటీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో యువకులు, పెద్దలు పాల్గొన్నారు.



అలీనఖీపాలెంలో ముస్లింల రక్తతర్పణం



లక్ష్మీపురంలో ఇఫ్తార్ విందు

లక్ష్మీపురంలో ఇఫ్తార్ విందు

పెదపారుపూడి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు పలు మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురం మసీదు వద్ద గ్రామానికి చెందిన షేక్ అన్వర్ బాషా ముస్లింలకు ఇఫ్తార్ విందు సోమవారం ఏర్పాటు చేశారు. కఠిన ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. భక్తి శ్రద్ధలతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు అన్వర్ బాషా తెలిపారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. షేక్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ విద్యార్థులు 48 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : కృష్ణా విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో 48 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చైతన్య విద్యాసంస్థలు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఉప కులపతితో పాటు రిజిస్ట్రార్ శోభన్‌బాబు, సుందరకృష్ణ, డాక్టర్ కిషోర్, డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఉప కులపతి ఆచార్య జ్ఞానమణి

విద్యావేత్తలకు సత్కారం



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పరాసుపేట సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం రామ్‌దేవ్, యోగా మాస్టర్ మల్లిఖార్జునను సత్కరించారు. పి.సాయి కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దిట్టకవి వెంకటేశ్వరరావు, ఉల్లి రంగారావు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బందరులో నివాళులర్పిస్తున్న కొల్లు రవీంద్ర దంపతులు



చిన్నాపురంలో మాజీ ఎంపీపీ, సర్పంచ్ తదితరులు



నాగాయలంకలో మత్స్యకార నేతల నివాళి

నడకుదిటి సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 : మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు బడుగు, బలహీనవర్గాల ప్రజలకు చేసిన సేవలు మరువలేమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. నడకుదిటి నరసింహారావు వర్ధంతి సందర్భంగా సోమవారం టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సంస్మరణ సభలో కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీసీలకు రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ఆరు గురుకుల విద్యాలయాలు స్థాపించారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గానికి ఎనలేని సేవలు చేశారన్నారు. కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్ లతో పాటు టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మరకాని పరబ్రహ్మం, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, హసీమ్‌బేగ్, అక్కుమహంతి రాజా, బత్తిన దాసు, జనసేన నాయకులు గడ్డం రాజు, చిన్నం సురేష్, వేణు తదితరులు పాల్గొన్నారు. కాగా, చిన్నాపురంలో జరిగిన నడకుదిటి సంతాపసభలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. **నాగాయలంక :** మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు నడకుదిటి నరసింహారావు బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని ఏపీ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు పేర్కొన్నారు. నాగాయలంకలోని మత్స్య భవనం వద్ద నిర్వహించి మాజీ మంత్రి నడకుదుటి నరసింహారావు మూడో వర్ధంతి సభలో లకనం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం మోపిదేవి కేంద్రంగా బీసీ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, మత్స్యకారుల బాలుర ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. మత్స్యకారులకు ప్రత్యేక గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేశారన్నారు. మత్స్యకారుల కో- ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మత్స్యకారుల సేవా సమితి జిల్లా నాయకులు నాగిడి తాతారాజు, లంకే శ్రీనివాసరావు, బీసీ నాయకులు అంద్రాజు ఆదినారాయణ, సైకం విజయ్ భాస్కర్‌రావు, కోలా భిక్షం, సైకం వెంకట కృష్ణ పాల్గొన్నారు.